E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 22-01-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక: 22|| పేజీలు–6 www.ekaburu.com



తొలి పంచ్ మనదే » 6లో

## క్రీడా మైదానాల అభివృద్ధికి 'టాటా' సంసిద్ధత



» 3లో

## రాష్ట్ర ప్రభుత్వం కోరితే సీబీఐ దర్యాప్తు



బొగ్గు గని 'సైట్ విజిట్'కు స్వీయ ధ్రువీకరణపత్రం సరిపోతుంది

సింగరేణి యాజమాన్యమే ఇవ్వాలన్న నిబంధనతో అవినీతికి బాటలు వేశారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

» 3లో

## ప్రైవేటు బస్సు దగ్ధం.. ముగ్గురి మృతి



» 3లో

# నిరుద్యోగం పెరుగుతున్నా మోదీ నోరు మెదపట్లేదు



కార్పొరేట్లకు సహజ వనరులు దోచిపెడుతున్నారు

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శలు

ఈకబురు, ఖమ్మం: ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారతదేశంలో నిరుద్యోగం, అసమానతలు, ధరలు పెరిగిపోతున్నా.. ప్రధాని మోదీ నోరు మెదపటం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం సహజ వనరులను దోచిపెడుతున్నారని, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వేస్టేషన్లు, అణుశక్తి, ఇతర ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణకు పూనుకున్నారని ఆరోపించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాల సందర్భంగా ఖమ్మంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఆర్ఎస్ఎస్, భాజపా, ఇతర మతతత్వశక్తులు సనాతన ధర్మం పేరిట మతం, కులం, లింగవివక్షతో సామాజిక రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఒక దేశం, ఒక ఎన్నిక అంటూ పార్లమెంటరీ వ్యవస్థ స్ఫూర్తికి భాజపా విఘాతం కలిగిస్తోందని దుయ్యబట్టారు. దేశంలో లౌకికవాద, ప్రజాతంత్ర శక్తులను కలుపుకొని

తరువాయి 2లో

# ఇంట్రెస్ట్.. ఇన్వెస్ట్

- తెలంగాణలో పెట్టుబడులకు దిగ్గజ కంపెనీల ఆసక్తి
- దావోస్‌లో పలు సంస్థలతో సీఎం రేవంత్ బృందం భేటీలు
- రూ.12,500 కోట్ల పెట్టుబడికి రష్మి గ్రూప్ ఎంవోయూ
- 12 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు
- క్లీన్ ఎనర్జీలో 'న్యూక్లర్ ప్రొడక్ట్స్' రూ.6 వేల కోట్ల పెట్టుబడులు
- ప్రపంచంలోనే తొలి 'బ్యూటీ టెక్ జీసీసీ'ని ఏర్పాటు చేయనున్న లోరియల్



ఈకబురు,హైదరాబాద్: డక్టైల్ ఐరన్ (డీఐ) పైపుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్, తెలంగాణలో స్టీల్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ.12,500 కోట్ల పెట్టుబడికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 12 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 2026'సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్'ప్రతినిధి బృందం రష్మి గ్రూప్‌తో భేటీ అయ్యింది. తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అవసరమైన బొగ్గు సరఫరా లింకేజీ సహా ఇతర సహకారం అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. చర్చల అనంతరం ఎంవోయూ కుదిరింది. గ్రీన్ మాన్యుఫాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యంపై కూడా రష్మి గ్రూప్ చర్చించింది. ఈ భేటీలో సంస్థ ప్రమోటర్ సజ్జన్‌కుమార్ పటావ్‌రి, డైరెక్టర్ సంజీబ్‌కుమార్ పటావ్‌రి పాల్గొన్నారు. కాగా డబ్ల్యూఈఎఫ్ సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం బుధవారం మరికొన్ని కీలక భేటీలు జరిపింది. వివిధ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. మరికొన్ని అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ కీలక ప్రకటనలు చేశాయి.

తరువాయి 2లో

# గ్రీన్‌లాండ్ స్వాధీనానికిబలప్రయోగం చేయను

- దాన్ని డెన్మార్క్‌కు అప్పగించడమే
- మా బుద్ధి తక్కువ పని.. దావోస్‌లో ట్రంప్





ఈకబురు, గ్రీన్‌లాండ్.. అమెరికా, రష్యా, చైనా మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో ఉంది. భద్రతా కారణాల రీత్యానే అమెరికా ఆ భూభాగాన్ని కోరుకుంటోంది తప్ప అరుదైన ఖనిజాల కోసం కాదు. అమిత శక్తిని, బలాన్ని ఉపయోగిస్తే తప్ప మాకు అది దక్కకపోవచ్చు. అలా చేస్తే మమ్మల్ని ఆపే శక్తి కూడా ఏదీ లేదు. కానీ, నేను అలా చేయను. దాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం నేను బలప్రయోగం చేస్తానని అందరూ అనుకుంటున్నారు. అలా చేయాలని నేను అనుకోవట్లేదు. చేయను కూడా. ఆ అతి పెద్ద మంచు ఖండాన్ని ఒక్క అమెరికా మాత్రమే కాపాడగలదు. దాన్ని అభివృద్ధి చేయగలదు. అలా కాపాడాలంటే యాజమాన్య హక్కు కావాలి. లీజులతో కుదరదు. వాస్తవానికి అది ఉత్తర అమెరికాలో భాగం. పశ్చిమార్ధ గోళానికి ఉత్తర హద్దులో ఉంది. అది మా భూభాగం. అందుకే అమెరికా ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి సంబంధించిన చర్చలు వెంటనే ప్రారంభం కావాలని నేను కోరుకుంటున్నాను.''

తరువాయి 2లో

# ప్రతి జులైలో హైదరాబాద్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక కొనసాగింపు సదస్సు

- దావోస్ వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో తెలంగాణ విజన్ 2047 ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా నటుడు చిరంజీవి

తరువాయి 3లో



ఈకబురు,హైదరాబాద్: హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు కొనసాగింపు సదస్సును ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే ప్రతి ఏడాది జులై/ఆగస్టులో హైదరాబాద్‌లో 'ఫాలోఅప్ ఫోరం' నిర్వహించాలని 'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్' ప్రతినిధులకు సూచించారు.

## అంతరిక్షానికి బై బై 2లో





## ఫోన్ ట్యాపింగ్ విచారణ ఒక డ్రామా: కవిత

ఈ-కబురు, బంజారాహిల్స్, రాష్ట్రంలో జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ విచారణ ఒక డ్రామా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

2లో

# కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాల తొలగింపే!

- దావోస్‌లో గ్రీన్‌కోతో చర్చలు కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం
- సింగరేణి టెండర్లపై కేంద్ర మంత్రి దాగుడుమూతలు: కేటీఆర్



ఈకబురు, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే జిల్లాల తొలగింపునకు అనుమతించడమేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములాఈ రేస్‌ని కుంభకోణంగా పేర్కొన్నవారు... దావోస్‌లో అదే గ్రీన్‌కోతో చర్చలు జరపడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సింగరేణిపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల కోసం మున్సిపాలిటీల వారీగా పార్టీ ఇన్‌ఛార్జులను నియమించనున్నామని, ఉమ్మడి జిల్లాలకు చెందిన వారికే బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. సర్వేలు కూడా చేయిస్తున్నామని, వాటి ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. సీఎం కాలికి బలపం కట్టుకొని తిరిగినా సర్పంచ్ ఎన్నికల్లో ఎన్నిస్థానాలు వచ్చాయో ప్రజలందరూ చూశారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. లేని 'ఫ్యూచర్ సిటీ' పేరుతో జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న సీఎం... దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర మంత్రి వైఖరి దివాలాకోరు విధానానికి నిదర్శనం**

సింగరేణి టెండర్లపై రాష్ట్రప్రభుత్వం కోరితే సీబీఐ దర్యాప్తు చేయిస్తామన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాదన దివాలాకోరు విధానానికి నిదర్శనమని కేటీఆర్ ఓ ప్రకటనలో విమర్శించారు. ఇది అజ్ఞానమా లేక ముఖ్యమంత్రితో భాజపాకు ఉన్న చీకటి ఒప్పందాల ఫలితమా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని సైట్ విజిట్ నిబంధనను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తీసుకొచ్చింది తన బావమరిదికి టెండర్లు అప్పజెప్పేందుకేనని తెలిసినా...

తరువాయి 2లో

# గణతంత్ర వేడుకలే లక్ష్యం..26-26 ఉగ్రదాడులు?

- పాక్‌కు చెందిన జైషే మహ్మద్ ప్రణాళిక!.. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరిక
- ఢిల్లీ, కశ్మీర్, పంజాబ్ సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు
- రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం



ఈకబురు, న్యూఢిల్లీ, జనవరి 21: గణతంత్ర వేడుకలే లక్ష్యం గా పాక్ ఉగ్రవాదులు దాడులకు కుట్ర పన్నారా? అంటే నిఘా వర్గాలు అవుననే అంటున్నాయి. పాక్‌కు చెందిన ఉగ్రసంస్థ జైషే మహ్మద్ భారత్‌లో ఉగ్రదాడులకు ప్రణాళిక వేసినట్లు వెల్లడించాయి. ఈ నెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు హెచ్చరించాయి. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ జైషే ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 26న పెద్దఎత్తున దాడులకు పాల్పడేందుకు '26/26' అనే కోడ్ నేమ్‌ను పెట్టుకున్నట్లు తెలిపాయి. గణతంత్ర వేడుకలకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో దాడులకు దిగవచ్చని తెలిపాయి. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు సరిహద్దులు సహా జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. పలువురు అనుమానితుల ఫొటోలతో ఢిల్లీ పోలీసులు వాంటెడ్ నోటీసులు జారీ చేశారు. వారిని ఎక్కడైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజల్ని కోరారు.

తరువాయి2లో

# ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



ఈ-కబురు, హైదరాబాద్: తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సహా ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను కొనసాగించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్ రూపకల్పన అధ్యయనం వేగంగా జరగాలని, కాళేశ్వరం పునరుద్ధరణ డిజైన్లు నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఇంట్రస్ట్.. ఇన్వెస్ట్



**రూ.6 వేల కోట్ల పెట్టుబడికి ఈఓఐ**
క్లీన్ ఎనర్జీ రంగంలో రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆసక్తి వ్యక్తీకరణ పత్రం (ఈఓఐ) సమర్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బృందంతో జరిగిన భేటీలో ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ చైర్మన్ డా.న్ బాబిక్, సీఈఓ, డైరెక్టర్ అనిల్‌కుమార్ బావిశెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ, డైరెక్టర్ మొలుగు శ్రీపాల్‌రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు. 2047 నాటికి కాలుష్య రహిత తెలంగాణ సాధన లక్ష్యంతో తమ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పడింది. ఇది గరిష్టంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణలో కొత్త విద్యుత్ ప్రాజెక్టు స్థాపనకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తోంది.

**'సర్గడ్'రూ.1,000 కోట్ల పెట్టుబడులు**
విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన 'సర్గడ్'సంస్థ రాష్ట్రంలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ నెలకొల్పనుంది. రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో దశల వారీగా రూ.1,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. సీఎం రేవంత్‌తో 'సర్గడ్'సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనివాస్ తోట భేటీ సందర్భంగా జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో విమానాల నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ (ఎమ్మార్వో) కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్తగా ఏర్పాటయ్యే విమానాశ్రయాల్లో ఏదో ఒకచోట ఎమ్మార్వో కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రోత్సాహకాలు ఇస్తామని సీఎం ప్రకటించారు. 'సర్గడ్'పెట్టుబడితో రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు తయారీ రంగంలో కొత్త అవకాశాలు వస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

**హైదరాబాద్‌లో లోరియల్ బ్యూటీ టెక్ జీసీసీ**
ప్రపంచంలోనే తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. అంతర్జాతీయంగా ఆవిష్కరణలు, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు కీలక కేంద్రంగా నిలిచే ఈ జీసీసీ నవంబర్‌లో ప్రారంభమవుతుంది. దీని ద్వారా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందుతాయి. మెడ్‌టెక్, హెల్త్‌టెక్‌తో పాటు 'బ్యూటీ టెక్'వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని శ్రీధర్‌బాబు అన్నారు. తమ జీసీసీ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా రేవంత్, శ్రీధర్‌బాబులను లోరియల్ ఆహ్వానించింది. కాగా రేవంత్‌రెడ్డి, లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ నడుమ జరిగిన భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ జీసీసీ ద్వారా 2030 నాటికి 2 వేల టెక్, ఏఐ, డేటా ఇంజనీరింగ్ ఉద్యోగాల కల్పన జరుగుతుంది.

**'బ్లైజ్'విస్తరణ**
హైదరాబాద్‌లోని తమ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని విస్తరించేందుకు కాలిఫోర్నియాకు చెందిన 'బ్లైజ్'సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. బ్లైజ్ కో ఫౌండర్, సీఈఓ దినకర్ మునగాల, ముఖ్యమంత్రి మధ్య జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆర్టిఫిషియల్ కంప్యూటింగ్‌కు తక్కువ శక్తి వినియోగించే ఏఐ హార్డ్‌వేర్, ఫుల్ స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను ఈ సంస్థకు చెందిన డేటా సెంటర్ అభివృద్ధి చేస్తోంది.

**విస్తరణకు 'ఏబీ ఇన్‌బెవ్'పెట్టుబడి**
ప్రపంచ వ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అతిపెద్ద బీరు తయారీ సంస్థ 'ఏబీ ఇన్‌బెవ్ 'రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న తమ తయారీ యూనిట్ విస్తరణకు పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. సీఎం రేవంత్‌రెడ్డితో సంస్థ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది.

స్టేడియంల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత
**– సంస్థ చైర్మన్‌తో సీఎం రేవంత్ భేటీ**
సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం దవోస్‌లో టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్‌లోని ప్రధాన క్రీడా మైదానాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసే ఆలోచన ఉందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, 2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేలా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చడంలో టాటా టెక్నాలజీస్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. కాగా స్పోర్ట్స్ స్టేడియాల అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు చంద్రశేఖరన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై ఆయన ఆసక్తి చూపారు. రాష్ట్రంలో హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుపై కూడా చర్చలు జరిగాయి. మేడారం, వేములవాడ, భద్రాచలం వంటి ఆలయ ప్రాంతాల్లో హోటళ్ల ఏర్పాటుకు టాటా గ్రూప్ ఆసక్తి చూపింది. శ్రీశైలం రహదారి వెంబడి అంతర్జాతీయ స్థాయి రిసార్ట్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించింది. ఏఐ డేటా సెంటర్లు, సెమీ కండక్టర్, ఈవీ తయారీ రంగాల్లో తెలంగాణలో కొత్త పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలపై కూడా చంద్రశేఖరన్ ఆసక్తి చూపారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇలావుండగా..సీఎం నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్'బృందం సిస్కో

# ప్రతి జులైలో హైదరాబాద్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక కొనసాగింపు సదస్సు



మొదటి పేజ తరువాయి

''హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించింది. ప్రతి ఏడాది మేం ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్‌కు వస్తాం. ఈసారి మా గ్లోబల్ సమిట్ విజయవంతం కావడంతో తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చాం. హైదరాబాద్ జీసీసీలకు ప్రధాన కేంద్రంగా మారింది. మూసీ పునరుజ్జీవంతోపాటు రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసి 'నైట్ టైమ్ ఎకానమీ'పై దృష్టి పెడతాం. దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. ఇందులో 50% కంటే ఎక్కువ పచ్చదనం ఉంటుంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఇదే కార్యక్రమంలో తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 202630'ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి... హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు, కుంటల పునరుజ్జీవం వంటి ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రితో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.

# నిరుద్యోగం పెరుగుతున్నా మోదీ నోరు మెదపట్లేదు



జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో 9 తీర్మానాలు
అమెరికా సామ్రాజ్యవాద ధోరణిని ఖండించటం, పది కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంఘీభావం, తమిళనాడులో మైనార్టీల రక్షణ, ఉపాధి హామీ పథకానికి పూర్వవైభవం, తమిళనాడు గవర్నర్‌ను రీకాల్ చేయటం, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించటం... వంటి తొమ్మిది అంశాలపై సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు చేశామని డి.రాజా తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ వర్తమాన రాజకీయ అంశాలపై చర్చించామన్నారు. పాలస్తీనా, వెనెజువెలా దేశాల్లో జరిగిన దాడులు, ఇతర దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు పెంచటం, వాణిజ్యం విషయంలో తలదూర్చి ఆంక్షలు విధించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ ఇంధనం కొనొద్దని ట్రంప్ చెబుతుంటే.. ప్రధాని మోదీ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. పార్టీ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండ, పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, పార్టీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, ఎస్కే సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్షానికి బై బై



**వ్యోమగామి సునీతా విలియమ్స్ రిటైర్మెంట్**
**ఈ-కబురు, న్యూఢిల్లీ, జనవరి 21: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ తన 27 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికారు. 608 రోజులపాటు అంతరిక్షంలోనే గడిపి, తొమ్మిది సార్లు స్పేస్‌వాక్ చేసిన 60 ఏళ్ల సునీతా విలియమ్స్ నాసా నుంచి రిటైరైనట్టు ప్రకటించారు. గత ఏడాది డిసెంబరు 27 నుంచే ఆమె రిటైర్మెంట్ అమల్లోకి వచ్చిందని నాసా వెల్లడించింది. 1998లో నాసాలో చేరిన సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) మిషన్లలో కీలక పాత్ర పోషించారు. తన సుదీర్ఘ కెరీర్‌లో మూడు సార్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లొచ్చారు. నాసా చరిత్రలో అత్యంత విజయవంతమైన వ్యోమగాముల్లో ఒకరిగా పలు రికార్డులు నెలకొల్పారు.**

# ఫోన్ ట్యాపింగ్ విచారణ ఒక డ్రామా: కవిత

**. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు రిజర్వేషన్లు అడగకుండా ఉండేందుకే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ జయంతి నిర్వహించారు. కవిత, జాగృతి నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాము అధికారంలోకి వస్తే శ్రీకాంతాచారి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. సికింద్రాబాద్ జిల్లా కావాలని అడిగిన వాళ్లను గతంలో భారాస అణచివేసిందని, ఇప్పుడు మాత్రం సికింద్రాబాద్ కార్పొరేషన్ కావాలని కేటీఆర్ అడగటం విచిత్రంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జాగృతి కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నేతలు పాల్గొన్నారు.**

# గ్రీన్‌లాండ్ స్వాధీనానికిబలప్రయోగం చేయను




దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

దావోస్, జనవరి 21: గ్రీన్‌లాండ్‌పై కన్నేసి ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. దాన్ని బలప్రయోగంతో స్వాధీనం చేసుకోబోమని దావోస్‌లో హామీ ఇచ్చారు. గ్రీన్‌లాండ్‌ను ఒక్క అమెరికా మాత్రమే కాపాడగలదన్న ఆయన.. యూరప్ సరైన దిశలో ప్రయాణించట్లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో దాదాపు 70 నిమిషాలపాటు ప్రసంగించిన ట్రంప్.. రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా సాధించిన విజయాల గురించి, గ్రీన్‌లాండ్ గురించి, సుంకాలు, పర్యావరణం, వలసలు.. ఇలా పలు అంశాల గురించి ప్రస్తావించారు. ''చాలామంది స్నేహితులు, కొద్దిమంది శత్రువులకు అభినందనలు'' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ట్రంప్.. తన ప్రసంగంలో గ్రీన్‌లాండ్ గురించే ప్రధానంగా ప్రస్తావించారు. రెండో ప్రపంచయుద్ధ సమయానికి అమెరికా అతిపెద్ద శక్తి అని.. గ్రీన్‌లాండ్‌ను తామే రక్షించి, యుద్ధం ముగిసిన తర్వాత డెన్మార్క్‌కు అప్పగించామని.. ఇప్పుడు తమ దేశం మరింత శక్తిమంతమైనదని గుర్తుచేశారు. ''అమెరికా తప్ప.. ఏ ఒక్కదేశమో, దేశాల కూటమో గ్రీన్‌లాండ్‌ను కాపాడలేదు.

అమెరికా అతి పెద్ద శక్తి. అందరూ అనుకుంటున్నదానికన్నా శక్తిమంతమైనది. ఈ విషయాన్ని వెనెజువెలా లో రెండువారాల క్రితమే అంతా గమనించి ఉంటా రు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో డెన్మార్క్ జర్మనీతో కేవలం ఆరు గంటలపాటు పోరాడి చేతులెత్తేసినప్పుడు.. తననుగానీ, గ్రీన్‌లాండ్‌నుగానీ కాపాడుకోలేని సమయంలో అమెరికా రంగంలోకి దిగింది'' అని గుర్తుచేశారు. అసలు ఆనాడు తాము (అమెరికా) వారికి ఆ భూభాగాన్ని ఇవ్వడమే బుద్ధి తక్కువ పని అని వ్యాఖ్యానించారు. అప్పుడు తామే లేకపోతే ఈపాటికి డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌వాసులు జర్మన్, కొద్దిపాటి జపనీస్ మాట్లాడుతూ ఉండేవని ఎద్దేవా చేశారు. డెన్మార్క్‌కు కృతజ్ఞత లేదన్న ట్రంప్.. ఆ దేశం నుంచి గ్రీన్‌లాండ్‌ను తీసుకునే విషయంలో తక్షణమే చర్చలు జరగాలని అభిప్రాయపడ్డారు. గతంలో యూరప్ దేశాలు కూడా ప్రపంచంలో పలు భూ భాగాలను స్వాధీనం చేసుకున్నాయి కాబట్టి.. తాను గ్రీన్‌లాండ్‌ను అడగడంలో తప్పేమీ లేదని సమర్థించుకున్నారు. ఈ సందర్భంగా.. తన గ్రీన్‌లాండ్ ఆశకు అడ్డంకిగా నిలుస్తున్న నాటో సభ్య దేశాలకు ఆయన ఒక హెచ్చరిక కూడా జారీ చే శారు. దశాబ్దాలుగా వారికి తాము ఇచ్చిన దానికన్నా వారి నుంచి అడుగుతున్నది చాలా తక్కువని గుర్తుచేశారు. ''(గ్రీన్‌లాండ్ స్వాధీనానికి) మీరు సరేనంటే మేం కృతజ్ఞులుగా ఉంటాం. 'కాదు' అంటే మాత్రం.. మేం గుర్తుపెట్టుకుంటాం'' అని పరోక్షంగా హెచ్చరించారు. మళ్లీ అంతలోనే.. ''ఇది నాటో కు హెచ్చరిక కాదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

యూరప్‌పై అసహనం..
ప్రపంచ దేశాలపై తాను విధించిన సుంకాల ద్వారా వస్తున్న ఆదాయాన్ని అమెరికాపరోగతి కోసం, ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నట్టు ట్రంప్ తెలిపారు. రెండేళ్ల క్రితం అమెరికా ఒక మృత దేశమని.. ఇప్పుడు మళ్లీ బతికి, బలంగా నిలబడిందని, అమెరికన్లుతనను ఎన్నుకున్నందుకు ఆనందంగా ఉన్నారని సొంత గొప్పలు చెప్పి, జబ్బలు చరుచుకున్నారు. ''ఈ భూగోళానికి అమెరి కా ఆర్థిక ఇంజన్‌లాంటిది. అమెరికా ఎదిగినప్పుడు ప్రపంచం మొత్తం ఎదుగుతుంది. ఇదే చరిత్ర'' అని ఘనంగా చెప్పుకొన్న ఆయన.. యూరప్ దేశాలపై మాత్రం అసహనం వ్యక్తం చేశారు. యూరప్ ప్రజల గురించి అమెరికా ఆలోచిస్తుందని.. తన తాతముత్తాతలు కూడా యూరప్ నుంచి వచ్చినవారే కాబట్టి, తనకు కూడా యూరప తో లోతైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. కానీ.. యూరప్ తనంత తానుగా బలహీనపడుతోందని అభిప్రాయపడ్డారు. యూరప్‌ను బలహీన ఖండంగా అభివర్ణించారు. ''యూరప్ దేశాలు ఇప్పుడు తమ మార్గాన్ని మార్చుకోవాలి. గత పదేళ్లలో అవి ఏర్పరచుకున్న ఆలోచనాసరళిని విడిచి బయటకు రావాలి. వారు తమను తామే నాశనం చేసుకుంటున్నారు. మాకు బలమైన మిత్రులు కావాలి. బలహీనమైన మిత్రులు కాదు. యూరప్ బలంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం.'' అని ట్రంప్ స్పష్టం చేశారు. వలసలు, ఆర్థిక పగ్రతి, సంస్కృతి వంటి విషయాల్లో యూరప్ తీసుకుంటున్న నిర్ణయాలు అంతర్గత రాజకీయాలకే పరిమితం కావని.. వాటి ప్రభావం ఆ దేశాల భద్రతతో పాటు, అమెరికా, ప్రపంచ భద్రతపై కూడా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పై..
రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని గంటల వ్యవధిలో పరిష్కరించగలనని తాను అనుకున్నానని.. కానీ, అదంత సులభం కాదని అర్థమైందని ట్రంప్ తెలిపారు. అయితే, ఆ యుద్ధాన్ని ఆపే ఒప్పందానికి తాను బాగా దగ్గరలో ఉన్నానని ఆయన పేర్కొన్నారు. పుతిన్, జెలెన్స్కీ ఈ యుద్ధాన్ని ఇప్పుడు ఆపకపోతే అది మూర్ఖత్వమేనన్నారు. ''కానీ వాళ్లు మూర్ఖులు కాదని నాకకు తెలుసు'' అని వ్యాఖ్యానించారు. తన ప్రసంగంలో పర్యావరణ లాబీ గురించి కూడా ప్రస్తావించిన ట్రంప్.. యూరప్‌లో కొంతమంది మూర్ఖులు పవనవిద్యుత్తు విషయంలో అమాయకంగా వ్యవహరిస్తున్నారని.. చైనా వారికి విండ్‌మిల్స్‌ను విక్రయించి సొమ్ము చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. చైనాలో ఎక్కడా విండ్‌మిల్స్ ఉన్నట్టు తాను చూడలేదని.. వాటివల్ల పక్షులు చనిపోతాయని, ప్రకృతి అందాలను చెడగొడతాయని.. మూర్ఖులే వాటిని కొంటారని దుయ్యబట్టారు. ''విద్యుత్తు ద్వారా డబ్బు సంపాదించాలి తప్ప కోల్పోకోడదు. విండ్‌మిల్స్ వల్ల డబ్బు కోల్పోతారు'' అని పేర్కొన్నారు. ఇక, అమెరికా నుంచి ఎన్నో ఉచితాలను పొందుతున్న కెనడా.. అమెరికా పట్ల కృతజ్ఞతగా ఉండాలని వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు కంటి సమస్య కారణంగా పెట్టుకున్న కళ్లజోడు గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. ''ఆ అందమైన చలువ కళ్లద్దాలతో ఆయన్ను నిన్న చూశాను. అసలేం జరిగింది?'' అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. ప్రసంగం అనంతరం 20 నిమిషాలపాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. భారత ప్రధాని మోదీ పట్ల తనకు గౌరవం ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్‌తో మంచి వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# గణతంత్ర వేడుకలే లక్ష్యం.. 26-26 ఉగ్రదాడులు?

సోషల్ మీడియాలో ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ.. జమ్మూకశ్మీర్, పంజాబ్, ఢిల్లీ, హరియాణాలోని యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.

తెలంగాణలోనూ హై అలర్ట్
దేశవ్యాప్తంగా ఈ నెల 26న పేలుళ్లతో విధ్వంసం సృష్టించడానికి ఉగ్రవాదులు కుట్ర పన్నారన్న సమాచారంతో కేంద్ర నిఘా బృందాలు ఇప్పటి కే రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద ముఠాలు దేశవ్యాప్తంగా ఉన్న తమ స్లీపర్ సెల్‌స్‌ను క్రియాశీలం చేస్తున్నాయని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదుల తాజా టార్గెట్ ఢిల్లీ మాత్రమే కాకుండా అహ్మదాబాద్, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, మైసూరు, హైదరాబాద్, తిరుపతి, కొచ్చి, చెన్నై లాంటి నగరాలనూ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని భావిస్తున్నాయి. స్లీపర్ సెల్స్ ఈ సారి భారీ స్థాయిలో ఆత్మాహుతి దాడులకు పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తున్నాయి. ఇక హైదరాబాద్‌తో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఉగ్రవాదుల కదలికలు బయటపడిన నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా హై అలర్ట్‌ను ప్రకటించారు. విమానాశ్రయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రజలు అత్యధికంగా సంచరించే మార్కెట్లు, మాల్‌స్‌ను ఉగ్రవాదులు టార్గెట్ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉగ్రవాద లింకులున్న అనుమానితులపై నిఘా పెట్టారు. తెలంగాణకు చెందిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు ఉగ్రవాద అనుమానితుల సమాచారాన్ని జిల్లా పోలీసులకు పంపించి అప్రమత్తం చేస్తున్నారు.



# కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాల తొలగింపే!



కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా ఇంకా దాగుడుమూతలు ఆడటానికి కారణం ఏమిటో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై విచారణ జరపాలంటూ సింగరేణి కార్మికులు మోగించిన జంగ్ సైరన్ రాష్ట్ర ప్రభుత్వానికే కాకుండా కేంద్రానికి కూడా హెచ్చరిక లాంటిదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

స్కీములు మాయం... స్కాములకే పరిమితం
కాంగ్రెస్ పాలనలో స్కీములు మాయమై స్కాములు మాత్రమే మిగిలాయని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలో దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేనిస్థాయిలో దోపిడీ జరిగిందన్నారు. ఈ అంశంపై మంత్రులు మాట్లాడటం లేదని, ఒక్కో మంత్రి ఒక్కో దేశానికి పారిపోయార[ని ఆరోపించారు. కుంభకోణం బయటపడగానే కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క ఒకర్ని మించి ఒకరు నటించారన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో భారాస మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ రాజిరెడ్డి, ఆయన అనుచరులు కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ వచ్చాక కొత్త నిబంధనల పేరుతో సింగరేణిని దోచుకుంటోందని ఆరోపించారు. గతంలో దేశంలో ఏ కాంట్రాక్టరైనా ఈటెండర్ ద్వారా పోటీపడే అవకాశం ఉండగా, ఇప్పుడు తప్పనిసరిగా సైట్‌కు వచ్చి ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సిందేనని చెప్పి అవినీతికి తలుపులు తెరిచారన్నారు. దీనిద్వారా ఎవరు టెండర్ వేయాలి, ఎవరు వేయకూడదో ముందే నిర్ణయించే వ్యవస్థ ఏర్పడిందన్నారు. ఈ ప్రక్రియలో ముఖ్యమంత్రి బంధువుల పాత్రపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చెన్నూరులో వివేక్ మంత్రి అయ్యాక పరిశ్రమలు ఏర్పాటు చేసి 4045 వేల మందికి ఉద్యోగాలు ఇస్తానని చెప్పారని, మూడేళ్లు గడిచినా 400 మందికైనా ఇవ్వలేదని కేటీఆర్ విమర్శించారు.

# రాష్ట్ర ప్రభుత్వం కోరితే సీబీఐ దర్యాప్తు

ఈకబురు, ఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం కోరితే సింగరేణిపై సీబీఐ దర్యాప్తు జరిపించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఒక్క నైనీ బ్లాక్ వ్యవహారంలోనే కాకుండా సింగరేణిలో జరుగుతున్న అక్రమాలన్నింటిపైనా చర్చ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. సంస్థ, కార్మికుల భవిష్యత్తు పరిరక్షణకు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల సింగరేణి నష్టాల్లో కూరుకుపోయిందని, కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తే లాభాల్లో తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆయన బుధవారం దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ''సింగరేణి కోల్ బ్లాక్‌కు సంబంధించిన వ్యవహారాలపై సీబీఐ దర్యాప్తు జరపకుండా కేంద్ర మంత్రి ఏం చేస్తున్నారంటూ కొందరు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 51% ఉన్న ఆ సంస్థలో దర్యాప్తు జరపడానికి స్థానిక ప్రభుత్వ అనుమతి ఉండాలి. ఆ విషయం తెలిసీ కొందరు నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. సింగరేణికి గత భారాస ప్రభుత్వం రూ.32 వేల కోట్ల బకాయిలు పెడితే... ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు హయాంలో రూ.47 వేల కోట్లకు చేరుకున్నాయి. దీనివల్ల ఉద్యోగులకు అప్పులు చేసి జీతాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. గ్రేడ్11 బొగ్గు టన్ను ధర కోల్‌ఇండియాలో రూ.1,605 మాత్రమే ఉంటే...

సింగరేణిలో రూ.4,088 ఉంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ దోపిడీయే ప్రధాన కారణం. కోల్ ఇండియా బొగ్గు నాణ్యత (86%)తో పోలిస్తే సింగరేణి బొగ్గు నాణ్యత (48%) పడిపోయినా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. దీంతో సింగరేణి బొగ్గు తమకొద్దంటూ ఎన్టీపీసీ, ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు ఉత్తరాలు రాశాయి. ఫలితంగా సంస్థ భవిష్యత్తు అంధకారమయంగా మారే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలోని సింగరేణి భూములను ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఆక్రమించుకోవడానికి గత భారాస ప్రభుత్వం అవకాశం ఇవ్వగా... ప్రస్తుత కాంగ్రెస్ సర్కారూ అదే చేస్తోంది. ఈ అంశంపై పాలకమండలి సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ప్రశ్నించినా ఫలితం లేదు. సింగరేణి యాజమాన్య హక్కులన్నీ రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లోనే ఉండటంతో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు పాలకమండలి తీరుతో విభేదించడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. అక్రమాలను పూర్తిగా అరికట్టాలి. అందుకే నా ఆదేశాలతో అత్యవసర పాలకమండలి సమావేశం ఏర్పాటు చేసి... రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి డైరెక్టర్లు, సీఎండీతో కేంద్ర బొగ్గుశాఖ అధికారులు మాట్లాడారు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి తిరిగివచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తారు. కేంద్ర మంత్రిగా సంస్థకు అన్నిరకాల సహాయాలు అందించడానికి సిద్ధంగా ఉన్నా. అయితే అవినీతి, అక్రమాలతో సంస్థ భవిష్యత్తును రోడ్డున పడేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.

వాటాలపై మంత్రుల మధ్య విభేదాలతోనే దోపిడీ వెలుగులోకి...
వాటాల విషయంలో రాష్ట్ర మంత్రుల మధ్య తలెత్తిన విభేదాల కారణంగానే సింగరేణిలో జరుగుతున్న దోపిడీ వ్యవహారాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. నైనీ బ్లాక్‌లో బొగ్గు వెలికితీత, రవాణా టెండర్‌లో 'సైట్ విజిట్'కు సంస్థ యాజమాన్యం ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్న నిబంధన చేర్చడం విస్మయకరం. దేశంలో అనేకచోట్ల సైట్ విజిట్ నిబంధన ఉంది. పూర్తి వివరాలు తెలియకుండా టెండర్ వేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతోనే టెండర్‌లో పాల్గొనే ప్రతిఒక్కరూ సైట్ విజిట్ చేయాలని, అలా చేసినట్లు స్వీయ ధ్రువీకరణపత్రం జతచేస్తే సరిపోతుందని మాత్రమే కేంద్రం చెప్పింది. కానీ, ఆ నిబంధనను పక్కనపెట్టి సైట్ విజిట్ చేసినట్లు యాజమాన్యం ధ్రువీకరణపత్రం ఇవ్వాలన్న నిబంధనను తెరపైకి తెచ్చి అవినీతికి బాటలు వేశారు. మంత్రులు తమకు నచ్చినవారికి మాత్రమే ధ్రువీకరణపత్రం జారీ చేసి, వారికే టెండర్లు దక్కేలా చేయాలని ఎత్తులు వేశారు. మంత్రుల మధ్య గొడవల కారణంగా ఆ వ్యవహారం బయటపడటంతో ఇప్పుడు టెండర్లను రద్దు చేశారు. గతంలోనూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే నైనీ బ్లాక్ తవ్వకాలకు టెండర్లు పూర్తి చేసినా ఏదో కారణంతో చివరి నిమిషంలో ఆపేశారు. ఇకముందు జరిగే టెండర్ల ప్రక్రియ పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం'' అని కిషన్‌రెడ్డి అన్నారు.



# క్రీడా మైదానాల అభివృద్ధికి 'టాటా' సంసిద్ధత

ఈకబురు, హైదరాబాద్: తెలంగాణలో క్రీడా మైదానాల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగస్వామ్యంపైనా ఆసక్తి చూపింది. తయారీ రంగంలో కొత్తయూనిట్ల స్థాపనపైనా చర్చించింది. ఈ మేరకు దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బుధవారం టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్2047, ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలోని పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని ఆయనకు ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళికాబద్ధమైన ఆలోచన విధానానికి ప్రణాళిక రూపొందించడంపై టాటా ఛైర్మన్ ప్రశంసించారు. పెట్టుబడుల కోసం కాకుండా... విధానాలు, ఫ్యూచర్ విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముందుకెళ్తోందని చంద్రశేఖరన్ అభినందించారు. హైదరాబాద్‌లోని ప్రధాన క్రీడా మైదానాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దే ఆలోచనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... టాటా గ్రూప్ ఛైర్మన్‌తో పంచుకున్నారు. క్రీడా మైదానాల అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చంద్రశేఖరన్ తెలిపారు. దేశంలో ప్రతిభ ఉన్నా.. క్రీడల్లో రాణించడానికి తగిన మౌలిక సదుపాయాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. యువతలో నైపుణ్యాల అభివృద్ధిపైనా వారు చర్చించారు. 65 ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చడంలో టాటా టెక్నాలజీస్‌తో కలిసి పనిచేస్తున్నామంటూ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఆనంద్ మహీంద్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు ఆలోచనలు... 2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేలా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను సీఎం వివరించారు. హైదరాబాద్‌లో చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు గురించి ముఖ్యమంత్రి చెప్పారు. రాజస్థాన్, మహారాష్ట్రలలో నీటి వనరుల పునరుద్ధరణలో టాటా గ్రూప్ అనుభవాన్ని గుర్తుచేస్తూ, మూసీ అభివృద్ధిలో భాగస్వామిగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా చంద్రశేఖరన్ తెలిపారు. మూసీ నది చుట్టూ ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. మేడారం, వేములవాడ, భద్రాచలం వంటి ఆలయాల ప్రాంతాల్లో హోటళ్ల ఏర్పాటుకు టాటా గ్రూప్ ఆసక్తి చూపింది. శ్రీశైలం రహదారి వెంబడి అంతర్జాతీయ స్థాయి రిసార్ట్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించింది. ఏఐ డేటా సెంటర్లు, సెమీకండక్టర్, ఈవీ తయారీ రంగాల్లో తెలంగాణలో కొత్త పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలపై టాటా ఛైర్మన్ ఆసక్తి వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఇజ్రాయెల్ పారిశ్రామిక క్లస్టర్

రాష్ట్రంలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనకు ఇజ్రాయెల్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. దావోస్ ఆర్థిక సదస్సులో మూడో రోజు బుధవారం ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్ బర్కత్, ఈ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, ట్రేడ్ మిషన్ ప్రతినిధి షిర్ స్లట్జ్కీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం, సువిశాల సముద్రతీర ప్రాంతం, అందుబాటులో ఉన్న ఓడరేవులు, విమానాశ్రయాలు, యువతలో సాంకేతిక పరిజ్ఞానం, సహజ వనరులు వంటి అంశాల గురించి ఇజ్రాయెల్ మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. విశాఖచెన్నై పారిశ్రామిక కారిడార్‌లో యూఏవీ డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ సాంకేతికతపై చర్చలు జరిగాయి. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్, సాంకేతికతపై సహకారం అందించడంపైనా చర్చించుకున్నారు. జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల తరహాలో ఇజ్రాయెల్ కూడా రాష్ట్రంలో ఒక పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆ దేశ మంత్రి బర్కత్‌ను చంద్రబాబు కోరారు. ఈ ప్రతిపాదన పట్ల బర్కత్ సానుకూలంగా స్పందించారు. కట్టుదిట్టమైన సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించడంపైనా చర్చ జరిగింది. సాంకేతిక సహకారం అందించడానికి ఇజ్రాయెల్ మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారు.

యూఏఈ విదేశీ, వాణిజ్య మంత్రితో భేటీ
ఏపీలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ విదేశీ, వాణిజ్య మంత్రి థాని బిన్ అహ్మద్ సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురూ పలు అంశాలపై చర్చించారు. అగ్రిటెక్, ఫుడ్ టెక్, ఆక్వా టెక్‌తో పాటు ఫుడ్ పార్కులు, ఎయిర్ పోర్టులు, రోడ్డు, రైలు నెట్‌వర్క్ ఏపీలో విస్తృతంగా ఉన్నాయని చంద్రబాబు వివరించారు. వీటితో పాటు జాతీయ పారిశ్రామిక కారిడార్లు కూడా రాష్ట్రంతో అనుసంధానమై ఉన్నాయని వివరించారు. యూఏఈకి చెందిన డీపీ వరల్డ్, షరాఫ్ గ్రూప్, ట్రాన్స్ వరల్డ్, ఏడీపోర్ట్స్, యాడ్‌నాక్ లాంటి కంపెనీలు ఏపీలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఏపీ నుంచి ఉద్యాన, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశాలు పరిశీలించాలని కోరారు. యూఏఈ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు మంచి అవకాశాలున్నాయన్నారు. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. యూఏఈకి చెందిన లాక్వా, మజ్జార్ లాంటి కంపెనీలతో పాటు ఏడీబీఏ, ముబాద్లా, ఏడిక్యూ లాంటి ఫండింగ్ సంస్థల ద్వారా పెట్టుబడులకు అవకాశాలున్నాయని వివరించారు. స్పేస్, డ్రోన్ సిటీల్లో యూఏఈ భాగస్వామ్యం వహించాలని కోరారు.

చంద్రబాబుతో స్విట్జర్లాండ్ బృందం భేటీ
ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్విట్జర్లాండ్ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. ఆ దేశ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి హెలెన్ బడ్లిగర్ ఆర్టిడా, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి అంబాసిడర్ ఆండ్రియా రోలర్, స్విస్ పార్లమెంటు సభ్యుడు నిక్ గగ్గర్ చర్చలు జరిపారు. ఏపీస్విట్జర్లాండ్ మధ్య వాణిజ్య సంబంధాలు, ఏపీలో స్విస్ కంపెనీల కార్యకలాపాలు, విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. కాగా ఎన్‌విడియా గ్లోబల్ ఏఐ ఇన్షియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మండ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడంతోపాటు యువతకు నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలను అందిస్తూ ఏఐ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటుచేసేలా ఏపీ ప్రభుత్వంతో కలసి పని చేస్తున్నట్లు కాలిస్టా రెడ్మండ్ తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఏఐ వర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఏపీతో ఒప్పందం చేసుకున్నట్లు కాలిస్టా తెలిపారు.



# ట్రంప్ ఏడాది పాలనపై నిరసనలు




వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ మంగళవారంతో ఏడాది పాలనను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ఆయన తీసుకొచ్చిన విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికా వ్యాప్తంగా వివిధ సంఘాల కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. ప్లకార్డులు, దిష్టిబొమ్మలతో ఆందోళనలు నిర్వహించారు. ట్రంప్ పాలన వల్ల అమెరికా అనేక సంవత్సరాలుగా నిర్మించుకున్న అంతర్జాతీయ విశ్వసనీయత పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు.

గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను నిరసనకారులు విమర్శించారు. నాటో కూటమిని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.
'గతేడాది నుంచి మా దేశం తీవ్ర దాడికి గురవుతోంది. దీనివల్ల మేం పూర్తిగా దారి తప్పుతున్నాం. దీనికి ముగింపు పలకాలి. మన వీధుల్లో సైన్యం తిరుగుతోంది. ప్రజలను అపహరించడం, హత్యలు చూస్తున్నాం. స్వతంత్ర దేశాల భూ భాగాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ నాటో కూటమిని బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఈ ప్రయత్నాలను ఆపేందుకే మేం రోడ్లపైకి వచ్చాం' పేర్కొన్నారు.
'దశాబ్దాలుగా మేం ప్రపంచవ్యాప్తంగా మిత్ర దేశాలను సంపాదించాం. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే ఇప్పుడు ఆ నమ్మకం పూర్తిగా క్షీణిస్తోంది. ఇతర దేశాలు అమెరికాను నమ్మలేని పరిస్థితి వచ్చింది. దీని ప్రభావం రానున్న దశాబ్దాల ప్రపంచ రాజకీయ వ్యవస్థపై పడుతుంది' అని ఆందోళనకారులు వ్యాఖ్యానించారు.
'సుంకాలనేవి అత్యంత దుర్మార్గమైనవి. గత 50 ఏళ్లుగా ఉన్న మిత్ర దేశాలకు ప్రభుత్వం ద్రోహం చేస్తోంది. ఇది అమెరికాను తీవ్రమైన ప్రమాదంలోకి నెడుతోంది. అమెరికన్ ప్రజలు, ప్రపంచం గురించి ట్రంప్ పట్టించుకోరు' అని కొందరు అభిప్రాయపడ్డారు.

# ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**. "నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సరిపడా నిధుల కేటాయింపునకు సీఎం అంగీకరించినందున యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించేందుకు అధికారులు చొరవ చూపాలి. సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల స్థలాల తనిఖీ నివేదిక, పనుల ప్రణాళిక సమర్పించింది. ఈ నెల 22న పరిశీలన పనులు ప్రారంభమవుతాయి. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్లు నెల వ్యవధిలో రూపొందించాలి. సత్వరం పర్యావరణ అనుమతులు పొందేందుకు కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. సీఎంతో చర్చించాక ప్రధాని మోదీకి వివరిద్దాం' అని ఉత్తమ్ పేర్కొన్నారు.**

# ప్రైవేటు బస్సు దగ్ధం.. ముగ్గురి మృతి



ఆళ్లగడ్డ, నంద్యాల నేరవార్తలు, శిరివెళ్ల, : అర్ధరాత్రి సమయం.. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు టైరు పేలడంతో అదుపుతప్పింది.. డివైడర్ మీదుగా దూసుకెళ్లి రోడ్డు అవతలివైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని దగ్ధమైంది.. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నుంచి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ఏఆర్‌బీసీవీఆర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బుధవారం అర్ధరాత్రి 2 గంటలు దాటాక నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం శిరివెళ్లమెట్ట వద్ద ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించారు. ఆ దారిన వెళ్తున్న డీసీఎం డ్రైవర్ వాహనాన్ని ఆపి బస్సు అద్దాలను పగులగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. కిటికీల్లోంచి దూకేయడంతో పదిమందికిపైగా ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మంటలు విస్తరించడంతో లారీ కూడా కాలిపోయింది. బస్సు డ్రైవరుతో పాటు లారీ చోదకుడు, క్లీనర్ మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. ప్రయాణికుల లగేజీ మొత్తం బూడిదైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

## పసిడి పరుగులు.. ఒక్కరోజే రూ.9వేలకు పైగా పెరిగి..



బంగారం, వెండి ధరల పరుగు ఆగట్లేదు. రోజురోజుకీ పెరుగుతూ కొత్త రికార్డులను అధిగమిస్తున్నాయి. ఇప్పటికే రూ.లక్షన్నర దాటిన మేలిమి (24 క్యారెట్లు) బంగారం 10 గ్రాముల ధర (Gold) బుధవారం మరింత పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో నేటి ఉదయం 11.45 గంటల సమయంలో పసిడి ధర ఏకంగా రూ.1.61 లక్షలు పలికింది. క్రితం రోజుతో (రూ.1,52,800) పోలిస్తే దాదాపు రూ.9వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,900కు చేరింది.

మరోవైపు, వెండి ధర (Silver Price) కూడా దూసుకెళ్తోంది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,30,000గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే ఇవాళ వెండి ధర దాదాపు రూ.14వేలు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ లోహాల ధరలు జోరుగా పెరుగుతున్నాయి. ఔన్సు వెండి ధర చరిత్రలో తొలిసారి 94 డాలర్ల మార్క్‌ను దాటి పయనిస్తోంది. ఇక ఔన్సు బంగారం ధర 4,849 డాలర్లను చేరింది.

గ్రీన్‌లాండ్ స్వాధీనానికి, గాజా శాంతిమండలిలో సభ్యత్వానికి సహకరించడం లేదంటూ ఐరోపా దేశాలపై, ఫ్రాన్స్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీ సుంకాలను ప్రకటించారు. దీంతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు పెరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం, వెండిని మదుపర్లు సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించడంతో వీటి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతుండడంతో దానికి విపరీతంగా డిమాండ్ ఏర్పడింది.

## వన్‌ప్లస్‌కు ఏమైంది?: మూసివేత రూమర్స్.. కంపెనీ సీఈఓ క్లారిటీ!

**చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్‌ను (Oneplus) మూసివేస్తున్నారంటూ ఓ కథనం ప్రచారంలోకి వచ్చింది. కంపెనీ మార్కెట్ విలువ అంతకంతకూ క్షీణిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నది దాని సారాంశం. ఎంతోమంది టెక్ ప్రియులను ఈ కథనం ఆశ్చర్యానికి గురిచేసింది. మరోవైపు భారత్‌లో వన్‌ప్లస్ యూజర్లలోనూ ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అసత్య ప్రచారాలను నమ్మొద్దని, భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయని వన్‌ప్లస్ ఇండియా సీఈఓ రాబిన్ లియు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.**

ఒకప్పుడు సొంత బ్రాండ్‌గా మొదలై తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన స్మార్ట్‌ఫోన్‌లలో వన్‌ప్లస్ ఒకటి. ఇతర కంపెనీల నుంచి వచ్చిన పోటీ వల్ల ఏటా తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. ఈ క్రమంలోనే మాతృ సంస్థ బీబీకే ఎలక్ట్రానిక్స్‌కు చెందిన మరో స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఒప్పోకు (Oppo) సబ్‌బ్రాండ్‌గా అవతరించింది. కొన్నేళ్లుగా ఆ కంపెనీకి సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతూనే ఫోన్లను లాంచ్ చేస్తోంది. ఇటీవలే మరో స్మార్ట్‌ఫోన్ కంపెనీ రియల్‌మీ కూడా ఒప్పోకు సబ్‌బ్రాండ్‌గా చేరింది. ఈ క్రమంలోనే వన్‌ప్లస్‌కు సంబంధించి ఈ కథనం బయటకు వచ్చింది. గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో వన్‌ప్లస్ తన మార్కెట్ వాటాను కోల్పోతుండడంతో ఈ కంపెనీని దశలవారీగా మూసివేస్తారని, ఒప్పోలో పూర్తిగా విలీనం చేయబోతున్నారంటూ 'ఆండ్రాయిడ్ హెడ్‌లైన్స్' తన కథనంలో పేర్కొంది. వన్‌ప్లస్‌కు భారత్, చైనా ప్రధాన మార్కెట్లు. కంపెనీ మొత్తం విక్రయాల్లో 74 శాతం ఇక్కడే జరుగుతుంటాయి. భారత్‌లో 2023లో 17 మిలియన్ యూనిట్లుగా ఉన్న వన్‌ప్లస్ విక్రయాలు 2024 నాటికి 1314 మిలియన్లకు పడిపోయాయి. కంపెనీ మార్కెట్ వాటా కూడా 6.1 శాతం నుంచి 3.9 శాతానికి చేరింది. చైనాలో 2 శాతంగా ఉన్న మార్కెట్ వాటా 1.6 శాతానికి పడిపోయింది.ఈ క్రమంలోనే వన్‌ప్లస్ మూసివేతపై నిర్ణయం తీసుకున్నారని ఆండ్రాయిడ్ హెడ్‌లైన్స్ పేర్కొంది. ఓపెన్‌కు కొనసాగింపుగా రావాల్సిన వన్‌ప్లస్ ఓపెన్ 2 లాంచింగ్‌ను నిలిపివేశారని, వన్‌ప్లస్ 15ఎస్ విడుదల ప్రణాళికను కూడా రద్దు చేశారని తెలిపింది. దీంతో హెచ్‌టీసీ, ఎల్‌జీ, బ్లాక్‌బెర్రీ తరహాలో మరో స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ కనుమరుగవుతోందంటూ టెక్ ప్రియుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ క్రమంలో కంపెనీ ఇండియా సీఈఓ క్లారిటీ ఇచ్చారు. నెవ్వర్ సెటిల్ అంటూ తన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.






## రిపబ్లిక్ డే సేల్‌లో భారీ ఆఫర్లు ప్రకటించిన అమెజాన్




ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇటీవల గ్రేట్ రిపబ్లిచ్ డే సేల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ అమెజాన్ బజార్ విభాగంలో కస్టమర్ల కోసం పెద్ద ఎత్తున ఫ్యాషన్, ఎలక్ట్రానిక్ యాక్సెసరీలు, ఇంకా అనేక విభాగాల్లో తక్కువ ధరలో ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. అమెజాన్ గ్రేట్ రిపబ్లిక్ డే సేల్ సందర్భంగా కస్టమర్లు డీల్స్, కొన్ని రకాల ప్రీమియం ఉత్పత్తులపై 80 శాతం వరకు ఆఫర్లను, రూ. 500 వరకు క్యాష్బ్యాక్ పొందవచ్చని తెలిపింది. ముఖ్యంగా రూ. 99 ప్రారంభ ధరలో లభించే వస్తువులపై అమెజాన్ బజార్లో మొదటి ఆర్డర్‌పై రూ. 50 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ఇదే సమయంలో ప్రైమ్ మెంబర్లకు 5 శాతం క్యాష్బ్యాక్, అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌పై నాన్-ప్రైమ్ మెంబర్లకు 3 శాతం, రూ. 2,500ల వరకు వెల్ గిఫ్ట్స్ సహా పేమెంట్, రివార్డులతో మరింత ఆదా చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. అర్హులైన కస్టమర్లు అమెజాన్ పే లేటర్ ద్వారా రూ. 60,000 వరకు తక్షణ క్రెడిట్ను కూడా యాక్సెస్ చేయవచ్చు. ప్రత్యేకమైన షాపింగ్ రివార్డులను కూడా ఆఫర్ చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. రోజుకు రూ. 99 ఈఎంఐ ద్వారా అమెజాన్ బజార్ నుంచి మొబైళ్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, ఇతర పరికరాలను కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం వరకు తక్షణ డిస్కౌంట్లను కూడా లభిస్తుంది. అదనంగా క్యాష్బ్యాక్, రివార్డ్స్ లభిస్తాయి. వాటిలో రూ. 799ల కన్నా ఎక్కువ ఆర్డర్లపై ప్రైమ్ మెంబర్లకు 5 శాతం తగ్గింపు, రూ. 499 కన్నా ఎక్కువ విలువ గల ఆర్డర్లపై అందరికీ 10 శాతం క్యాష్బ్యాక్ ఉంటుందని అమెజాన్ తెలిపింది. ఇవి మాత్రమే కాకుండా అనేక రకాల ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డులను అందిస్తున్నట్టు పేర్కొంది.

## మార్కెట్లపై బేర్ పట్టు.. 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ రాజకీయ భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో సూచీలు భారీగా పతనమవుతున్నాయి. ఉదయం 11.05 గంటల సమయంలో సెన్సెక్స్ 886 పాయింట్ల నష్టంతో 81,295 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 250 పాయింట్లు క్షీణించి, 24,981 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లు కోల్పోయింది.

మార్కెట్ పతనానికి కారణాలు..

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. నేటి సెషన్‌లో తొలిసారి ఏకంగా 91.28కి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న అనిశ్చితులు, డాలర్లకు గిరాకీ పెరగడం వంటి కారణాలు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇక, దక్షిణకొరియా, జపాన్, హాంకాంగ్ వంటి ఆసియా మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. నిన్న అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.

విదేశీ సంస్థాగత మదుపర్లు (FIIలు) భారత స్టాక్ మార్కెట్ నుంచి భారీగా నిధులు వెనక్కి మళ్లించడం సూచీల పతనానికి ఓ కారణం. నిన్న ఒక్కరోజే రూ.2,938.33 కోట్లు ఉపసంహరించుకున్నారు. జనవరిలో వరుసగా 11వ సెషన్‌లోనూ ఈ అమ్మకాలు కొనసాగడం గమనార్హం. మార్కెట్ అస్థిరతను కొలిచే వీఐఎక్స్ నాలుగుశాతం పెరిగి 13.22కి చేరింది.

ట్రంప్ టారిఫ్ ప్రకటనలతో మదుపర్లు అప్రమత్తతో వ్యవహరిస్తున్నారు. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సహకరించని ఐరోపా యూనియన్ దేశాలపై సుంకాల ప్రకటనలు అంతర్జాతీయ వాణిజ్యంలో అంతరాయాలను కలిగిస్తున్నాయి. బ్యాంకింగ్ షేర్లు కుదేలవడం మిగతా రంగాల పైన కూడా ప్రభావం చూపుతోంది.

## ఎటర్నల్ గ్రూప్ సీఈఓ పదవి నుంచి వైదొలగిన దీపిందర్ గోయల్




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈఓ పదవి నుంచి దీపిందర్ గోయల్ వైదొలగుతున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయం ఫిబ్రవర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. కంపెనీకి కొత్త సీఈఓగా ప్రస్తుతం బ్లింక్‌ఇట్ బాధ్యతలు చూస్తున్న అల్బీందర్ దిండ్సా రానున్నారు. ఈ మేరకు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ వివరాలను వెల్లడించింది. ఈ విషయంపై షేర్‌హోల్డర్లకు రాసిన లేఖలో దీపిందర్ గోయల్.. ఇటీవల తనకు హై రిస్క్ ఉన్న కొత్త ఆలోచనలు వచ్చాయి. అయితే, వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎటర్నల్ లాంటి పబ్లిక్ లిస్టెడ్ కంపెనీకి బయట ఉండి చేయాల్సి ఉంటుంది. ఈ కారణంగానే సీఈఓ పదవికి రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇక నుంచి ఎటర్నల్ గ్రూప్ బాధ్యతలను అల్బీందర్ దిండ్సా నిర్వహిస్తారు. కంపెనీ కార్యకలాపాలు, నిర్వహణ, వ్యాపార నిర్ణయాలను ఆయనే తీసుకుంటారని దీపిందర్ గోయల్ తన లేఖలో వివరించారు. ప్రస్తుతం బ్లింక్‌ఇట్ నిర్వహణలో ఆయన సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎటర్నల్‌ను విజయవంతంగా నడిపిస్తారనే నమ్మకం తనకుందని అభిప్రాయపడ్డారు. ఇక, తాను కంపెనీ బోర్డు డైరెక్టర్, వైస్‌ఛైర్మన్‌గా కొనసాగుతానని వెల్లడించారు.

## కొత్త సిమ్ కార్డ్స్.. నయా మోసాలు

కొత్త సిమ్ కార్డు తీసుకోవాలన్నా, లేదా వేరే నెట్‌వర్క్‌కు పోర్ట్ చేయాలన్నా డీలర్ దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. రాజస్థాన్ జోధ్‌పూర్‌లో బస్ని పోలీసులు ఓ సైబర్ క్రైమ్ గురించి ఎంక్వైరీ చేస్తుండగా.. మురాద్ ఖాన్ అనే వెల్డర్ పేరుతో ఒక మొబైల్ నెంబర్ నమోదై ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు అతడిని కలిసి విచారించగా.. అసలు తన పేరు మీద ఆ నెంబర్ ఉన్నట్టు తనకు కూడా తెలియదని షాక్ గురయ్యాడు. మరోవైపు ఆ నంబర్‌తో లక్షల రూపాయల సైబర్ మోసాలు జరిగినట్టు పోలీసులు దగ్గర వివరాలు ఉన్నాయి. అయితే అసలు విషయం ఏమిటంటే.. 2024 ఫిబ్రవరిలో నెట్‌వర్క్ సరిగా రాక తన పాత సిమ్‌ను పోర్ట్ చేసుకున్న సమయంలో డీలర్ రెండుసార్లు ఫోటో, ఫింగర్ ప్రింట్ తీసుకున్నట్టు మురాద్ వెల్లడించాడు. ఆ వివరాలతోనే అతడి పేరుతో మరో సిమ్‌ను డీలర్ సైబర్ నేరగాళ్లకు విక్రయించాడని పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదుతో సిమ్ కార్డు డీలర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

దీని వెనుక అమాయకుల బయోమెట్రిక్ వివరాలతో సిమ్‌లు తీసుకుని మోసాలు చేస్తున్న పెద్ద ముఠా ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనినిబట్టి సిమ్ తీసుకునేటప్పుడు ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ మళ్లీ మళ్లీ అడిగితే వెంటనే అనుమానించి, తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



## వినోదాల చీన్ టపాక్ డుం



గవిరెడ్డి శ్రీను హీరోగా వై.ఎన్. లోహిత్ దర్శకత్వంలో 'చీన్ టపాక్ డుం డుం' అనే చిత్రం శ్రీకారం చుట్టుకుంది. దీన్ని శ్రీను నాగులపల్లి నిర్మిస్తున్నారు. బ్రిగిడా సాగా కథానాయిక. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సమంత క్లాప్ కొట్టారు. వశిష్ఠ కెమెరా స్విచ్చాన్ చేశారు. గోపీచంద్ మలినేని గౌరవ దర్శకత్వం వహించారు. నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. "టైటిల్‌కు తగ్గట్లుగానే ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: పీఆర్, ఆర్ట్ డైరెక్టర్: ఏఎస్ ప్రకాశ్, ఛాయాగ్రహణం: సెంథిల్ కుమార్. డుం

## ధురంధర్ ప్రతీకారం



**శత్రు దేశమైన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల్ని సమూలంగా అంతం చేసేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చేపట్టిన రహస్య ఆపరేషన్ నేపథ్యంలో రూపొందిన సినిమా 'ధురంధర్'. బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని ఆదిత్య ధర్ తెరకెక్కించారు. గతేడాది థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకి పలు విమర్శలు ఎదురైనా.. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, ఆర్.మాధవన్, సారా అర్జున్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు సీక్వెల్ రాబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి 'ధురంధర్: ది రివెంజ్' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. త్వరలో టీజర్ కూడా విడుదల కాబోతున్నట్లు బాలీవుడ్ సినీవర్గాల్లో చర్చ జరుగుతోంది. కొనసాగింపుగా రాబోతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.**

# అలాంటి సినిమాలు హీరోలతో మాత్రమే చేస్తారు: మాళవిక

గతేడాది విడుదలై సంచలనం సృష్టించిన సినిమాల్లో 'కొత్తలోక: చాప్టర్ 1' ఒకటి. చిన్న సినిమాగా విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా మాళవిక మోహనన్ (Malavika Mohanan) ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇలాంటి సినిమాలను హీరోలతో చేయడానికి మాత్రమే నిర్మాతలు ఆసక్తి ప్రదర్శిస్తారని అన్నారు.

"మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలకు కలెక్షన్లు రావని చాలా మంది నిర్మాతలు భావిస్తారు. అందుకే హీరోయిన్‌లు లీడ్‌రోల్ చేసే వాటిని అధిక బడ్జెట్‌తో తీసేందుకు ముందుకు రారు. మహిళా ప్రాధాన్యత ఉన్న చిత్రాలకు పెట్టుబడి పెట్టేందుకు ఎవరూ ఆసక్తి చూపరు.. అందుకే అవి తక్కువగా వస్తుంటాయి. వీటికి 'కొత్తలోక' సమాధానం చెప్పింది. యువ నటి ప్రధానపాత్రలో చేసిన ఆ చిత్రం రికార్డులు సృష్టించింది. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు చేసింది. కల్యాణి ప్రియదర్శన్ (Kalyani Priyadarshan) ఆ పాత్రకు న్యాయం చేస్తుందని దర్శకనిర్మాతలు నమ్మారు కాబట్టే ఆ చిత్రం అంతటి విజయాన్ని సొంతం చేసుకుంది'' అని మాళవిక అన్నారు.

గతేడాది ఆగస్టులో విడుదలైన 'కొత్తలోక: చాప్టర్ 1' అత్యధిక కలెక్షన్లు (రూ.300 కోట్లు+) రాబట్టిన మలయాళ సినిమాగా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో డొమినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ సినిమా తెలుగులోనూ ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఓటీటీ 'జియో హాట్‌స్టార్' (Jio Hotstar)లో స్ట్రీమింగ్ అవుతోంది.







# ఆ అవసరం వస్తుందనుకోను!



స్వచ్ఛమైన హాస్యంతో నేను సినిమా చేసిన ప్రతిసారీ వాళ్లు విజయాన్ని కట్టబెడుతున్నారు. 'నారీ నారీ నడుమ మురారి' సినిమా నేను అనుకున్న ఫలితాన్ని రాబట్టడం ఎంతో తృప్తినిచ్చింది'' అన్నారు శర్వానంద్. ఆయన హీరోగా, రామ్ అబ్బరాజు తెరకెక్కించిన సినిమానే 'నారీ నారీ నడుమ మురారి'. సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా శర్వానంద్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.


"తొలి రోజు ఈ కథ విన్నప్పుడు... చిత్రీకరణలో ఉన్నప్పుడూ ఈ సినిమాతో కచ్చితంగా పెద్ద విజయాన్ని అందుకుంటామని చెప్పేవాణ్ని. ఇక సంక్రాంతి సీజన్‌లో ఇలాంటి సినిమాల్ని ఇంకా బాగా ఆదరిస్తారు. ఆ విషయం ఎప్పుడో రుజువైంది. అందుకే నాలుగు సినిమాలు విడుదలవుతున్నా, కథపై నమ్మకంతో మేం కూడా వచ్చాం. పైగా ఈ సంక్రాంతికి సుదీర్ఘమైన వారాంతాలు చాలానే కలిసొచ్చాయి. ఇలా పక్కా ప్రణాళికలతోనే మేం సినిమాని విడుదల చేశాం. బాగుందనే మాట వినిపించగానే మా చిత్రానికి థియేటర్లు పెరిగాయి. ప్రతి సినిమా కథ నచ్చే చేస్తాం. విజయం సాధించాలనే కష్టపడతాం. కానీ అన్నీ కుదరాలి. ఈ సినిమాకి అలా అన్నీ కుదిరాయి''.

"హాస్య ప్రధానమైన కథల్లో నటించడం నాకు కొత్త కాదు. అయితే ఒక సినిమా హిట్టయ్యిందని, మళ్లీ అలాంటి కథలే చేయాలనుకోను. ఒక నటుడిగా, ఓ కథకుడిగా ప్రతి సినిమాతోనూ ఓ కొత్త కథనే చెప్పాలని ఉంటుంది. అందుకే నేనెప్పుడూ ఒక జానర్‌కి పరిమితం కాలేదు. స్వచ్ఛమైన హాస్యంతో కూడిన కథలు చాలా అరుదు. దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ కథ చెప్పగానే నాకు ఎంత ముచ్చటేసిందో! పరిశ్రమకు తనలాంటి దర్శకులు చాలా అవసరం. కథ ఎంత బాగా రాసుకున్నాడో, అంతే స్పష్టతతో చిత్రాన్ని తెరకెక్కించాడు. తన 'సామజవరగమన' సినిమా అంటే కూడా అంతే ఇష్టం. ఈ కథకు 'నారీ నారీ నడుమ మురారి' పేరైతేనే బాగుంటుందని బాలకృష్ణని సంప్రదించాం. అంత గొప్ప పేరు పెట్టుకున్నప్పుడు ఆ పేరు నిలబెట్టకపోతే బాగుండదు కదా. నిన్ననే మళ్లీ బాలకృష్ణకు ఫోన్ చేశా. ఆయన అభినందనలు చెబుతూ, నా పరువు నిలబెట్టావ్ శర్వా అన్నారు (నవ్వుతూ)''.

"నాకు ఇలాంటి కథ కావాలని నేనెప్పుడూ ప్రత్యేకంగా కథలు రాయించలేదు. ఇకపై అలాంటి అవసరం వస్తుందని కూడా నేననుకోను. దర్శకులు సిద్ధం చేసి తీసుకొచ్చిన కథలతోనే ప్రయాణం చేశా. అలాంటి మంచి కథలు నా దగ్గరకు రావడం నా అదృష్టం. తదుపరి నా సినిమా 'బైకర్' భారతదేశం గర్వపడేలా ఉంటుంది. ఇది తెలుగు సినిమా అని కాలర్ ఎగరేసి చెప్పేంత గొప్పగా ఉంటుంది. సంపత్ నంది దర్శకత్వంలో చేస్తున్న 'భోగి' కూడా మంచి కథ. ఆ తర్వాత శ్రీనువైట్లతో కలిసి పూర్తిస్థాయి హాస్య ప్రధానమైన సినిమా చేయబోతున్నా. అది మరింతగా నవ్విస్తుంది''.

ఆ లుక్ నాకే నచ్చలేదు "కొత్త లుక్‌లో నేను కనిపిస్తున్న తీరు అందరికీ నచ్చింది. 'బైకర్' కోసమే ఇలా మారిపోయాను. 'సూర్య సన్నాఫ్ కృష్ణన్'లో సూర్య ఎలా కనిపిస్తారో అలా 'బైకర్'లో రెండు రకాల లుక్స్‌లో కనిపించాల్సి వచ్చింది. అందుకే బరువు తగ్గి కొత్త లుక్‌లోకి మారిపోయా. 'జాను' సమయంలో నాకు ప్రమాదం జరిగింది. దాంతో బరువు పెరిగా. 'శ్రీకారం', 'ఆడవాళ్లూ మీకు జోహార్లు' సినిమాల్లో బొద్దుగా కనిపించా. వాటిలో నా లుక్ నాకే నచ్చలేదు. 'భోగి' సినిమాలో పొడవాటి జుట్టుతో మరింత కొత్తగా కనిపించబోతున్నా''.

## 'భగవంత్ కేసరి' ఇంకా హిట్ కావాల్సింది.. కానీ: అనిల్ రావిపూడి




ప్రస్తుతం దర్శకుడు అనిల్ రావిపూడి 'మన శంకర వరప్రసాద్ గారు' విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సంక్రాంతికి వచ్చిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రోజుకో కొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంటోంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనిల్ (Bhagavant Kesari) గతంలో తాను దర్శకత్వం వహించిన 'భగవంత్ కేసరి' గురించి మాట్లాడారు. అది ఇంకా పెద్ద విజయం సాధించాల్సిన చిత్రమని అభిప్రాయపడ్డారు.

"బాలకృష్ణతో నేను ఎవరూ ఊహించనివిధంగా సినిమా చేయాలనుకున్నాను. నా కెరీర్‌లో కష్టపడి రాసుకున్న స్క్రిప్ట్‌లలో అదీ ఒకటి. కానీ, ఆ సినిమా ఇంకా హిట్ కావాల్సింది. అది విడుదలైనప్పుడు చంద్రబాబునాయుడు జైలులో ఉండడంతో బాలయ్య అభిమానులు చాలామంది నిరాశకు గురయ్యారు. సాధారణ ప్రేక్షకులు దాన్ని చూసి ఆదరించి హిట్ చేశారు. పరిస్థితులు బాగుండి ఉంటే దానికి ఇంకా ఆదరణ దక్కేది'' అని అనిల్ రావిపూడి అన్నారు. అయితే, విజయ్ హీరోగా రానున్న 'జన నాయగన్' స్క్రిప్ట్ విషయంలో తాను (Anil Ravipudi) సాయం చేశాక ఆ నిరాశ నుంచి కొంత బయటకు వచ్చినట్లు చెప్పారు.

90 రోజుల ముందు టికెట్ ధరల పెంపుదల.. అదే పెద్ద బేతాళ ప్రశ్న..

బాలకృష్ణ (Balakrishna) హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'భగవంత్ కేసరి' తెరకెక్కింది. 2023 అక్టోబర్ 19న విడుదలైన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంది. ఈ సినిమా 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా అవార్డును సొంతం చేసుకుంది.

# 'ధురంధర్' 20 ఏళ్ల ఏజ్ గ్యాప్.. ఆ విమర్శలు పట్టించుకోను: సారా అర్జున్

ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. ఈ సినిమా విజయం (Dhurandhar) ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh), సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ (Sara Arjun) ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు.

"ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా.. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' కథ నచ్చింది. ఆ కథకు నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. బహుశా దీనిగురించి టీజర్ వచ్చినప్పుడే మాట్లాడుకున్నారు. నేను ఆ సమయంలో అసలు ఫోన్ చూడలేదు'' అని చెప్పారు.

నేను చదువుకున్న బోర్డింగ్ స్కూల్‌లో మాకు ఫోన్ లేదు. బయటకు వచ్చిన దగ్గర నుంచి వరుస సినిమాలతో బిజీగా ఉన్నా. అందుకే సోషల్ మీడియా అలవాటు కాలేదు. ఏదైనా పోస్ట్ చేయాలనుకున్నప్పుడు చేస్తానంతే. వినోదం కోసం ఇతర మార్గాలు ఎంచుకుంటా. విరామ సమయంలో ట్రిప్‌లకు వెళ్తుంటా. నేను ఒకేచోట ఎక్కువ రోజులు ఉండలేను'' అని సారా అర్జున్ చెప్పారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' గతేడాది డిసెంబర్ 5న విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికీ థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,283 కోట్లు వసూలు చేసింది.



## కొన్ని జ్ఞాపకాలు.. మసకబారవు

'కొన్ని జ్ఞాపకాలు మసకబారిపోవు.. రక్తం చిందిస్తాయి''అంటూ సిరీస్ ప్రియుల్లో ఉత్కంఠతని రేకెత్తిస్తోంది బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'దల్దాల్'. సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సిరీస్‌కు అమృత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ ఈ నెల 30 నుంచి ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో సిరీస్ బృందం తాజాగా ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో భూమి తెగిపడి ఉన్న చేతుల మధ్య కనిపిస్తూ.. వీక్షకులలో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ముంబయి నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించనుంది భూమి. ఆమె ఓ సీరియల్ కిల్లర్‌ని ఎలా వేటాడిందనే కథాంశంతో రూపొందిందీ సిరీస్.



# అగ్రస్థానం కోల్పోయిన కోహ్లి



దుబాయ్: వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన జాబితాలో న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్ డరిల్ మిచెల్ అగ్రస్థానాన్ని చేజిక్కించుకున్నాడు. మిచెల్ భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రెండు శతకాలు, ఒక అర్ధశతకంతో మొత్తంగా 352 పరుగులు సాధించి.. కోహ్లిని రెండో స్థానానికి నెట్టాడు. రోహిత్‌శర్మ 4, శుభ్‌మన్ గిల్ 5, కేఎల్ రాహుల్ 10, శ్రేయస్ అయ్యర్ 11వ ర్యాంకులు సాధించారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ 7, మహ్మద్ సిరాజ్ 14వ స్థానాల్లో నిలిచారు. రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్) నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు.

# భారత్‌కు రావాల్సిందే..




**బంగ్లాకు తేల్చి చెప్పిన ఐసీసీ**
**ప్రపంచకప్ మ్యాచ్‌ల తరలింపునకు నో**
**దుబాయ్**

బంగ్లాదేశ్‌కు పూర్తిగా దారులు మూసుకుపోయాయి. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు భారత్‌కు రాక తప్పదు. లేదంటే టోర్నీ నుంచే తప్పుకోవాల్సి ఉంటుంది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. భారత్‌లో పొట్టి కప్పు జరిగే ఏ వేదికలోనూ బంగ్లా ఆటగాళ్లు, అధికారులు, అభిమానులకు ముప్పు వాటిల్లుతుందన్న సంకేతాలేమీ లేనందువల్ల షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయని స్పష్టం చేసింది. షెడ్యూల్‌లో మార్పులు చేయడం సాధ్యం కాదని ఐసీసీ తేల్చిచెప్పింది. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన బోర్డు సమావేశంలో ఐసీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ''ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌లను వేరే చోటుకి తరలిస్తే ఐసీసీ టోర్నీల గౌరవానికి ముప్పు వాటిల్లుతుంది. ప్రపంచ క్రికెట్ పాలక మండలి తటస్థతను దెబ్బతీస్తుంది'' అని ఐసీసీ పేర్కొంది. బోర్డు సమావేశంలో సభ్య దేశాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాత్రమే మ్యాచ్‌ల తరలింపునకు అనుకూలంగా ఓటు వేసినట్లు ఐసీసీ వర్గాలు తెలిపాయి. భారత్‌కు వెళ్లాలా? లేదా? అన్నది బుధవారం లోపు తేల్చుకోవాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ అల్టిమేటం జారీచేసిన సంగతి తెలిసిందే. కానీ తమ జట్టు భారత్‌కు వెళ్లదని, ఐసీసీ ఒత్తిడికి తాము తలవంచబోమని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ స్పష్టం చేశాడు. 20 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ కోసం బంగ్లాదేశ్.. భారత్‌కు రాని పక్షంలో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తోంది. అంతే కాక బంగ్లాపై ఐసీసీ చర్యలు కూడా చేపట్టే అవకాశముంది. ఈ టోర్నీ ఆదాయంలో తమ వాటాను కోల్పోవడంతో పాటు జరిమానాను కూడా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) ఎదుర్కోవాల్సి రావచ్చు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో భారత అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాగా, బీసీసీఐ ఆ దేశ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో వివాదం రాజుకుంది. ప్రతిగా భారత్‌లో తమ భద్రతకు ముప్పు ఉందనే సాకుతో తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీకి విన్నవించింది. ఐసీసీ ఇందుకు సమ్మతించని నేపథ్యంలో బీసీబీ ఏం చేస్తుందో చూడాలి. వచ్చే నెల 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.

బంగ్లా మ్యాచ్‌లను మేం నిర్వహిస్తాం... పాక్: భద్రతా కారణాల రీత్యా.. టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు వెళ్లకూడదని బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయానికి దాయాది దేశం పాకిస్థాన్ మద్దతు పలికింది. బంగ్లా మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించడంలో సమస్యలుంటే.. వాటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి పాక్ చెప్పింది. ఐసీసీ బోర్డు సమావేశంలోనూ ఆ దేశం.. బంగ్లాకు మద్దతుగా ఓటేసింది.

# రెండో స్థానంలో అర్జున్

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీలో అర్జున్ ఇరిగేశి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. నాలుగో రౌండ్లో అతను.. అనీష్ గిరితో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. సిందరోవ్, జోర్డెన్ వాన్‌తో కలిసి అర్జున్ (2.5 పాయింట్లు) ఉమ్మడిగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. నీమన్, నాదిర్బెక్ అబ్దుసతారోవ్ చెరో మూడు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. గుకేశ్ (2 పాయింట్లు) వరుసగా నాలుగో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానందతో పాయింట్ పంచుకున్న అతను.. ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. రెండు డ్రాలు, రెండు ఓటములతో.. ప్రజ్ఞానంద (1 పాయింట్) అట్టడుగు స్థానంలో ఉన్నాడు. నీమన్ చేతిలో పరాజయం పాలైన అరవింద్ చిదంబరం (1.5 పాయింట్లు) ఉమ్మడిగా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.



# తొలి పంచ్ మనదే

**మొదటి టీ20లో కివీస్ చిత్తు**
**అభిషేక్ మెరుపులు**
**రాణించిన రింకు, వరుణ్**
**నాగ్‌పుర్**

**న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను కోల్పోయిన టీమ్‌ఇండియా.. అయిదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది. మొదట భారీ స్కోరు చేసి, ఆపై బంతితో కివీస్‌ను నిలువరించిన సూర్యసేన.. ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌లో అదరగొట్టగా.. బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను కట్టడి చేశారు.**



ప్రపంచకప్ ముంగిట కీలక సిరీస్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. అయిదు టీ20ల సిరీస్ తొలి మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 7 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోరు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (84; 35 బంతుల్లో 5×4, 8×6) మరోసారి చెలరేగాడు. రింకు సింగ్ (44 నాటౌట్; 20 బంతుల్లో 4×4, 3×6), సూర్యకుమార్ (32; 22 బంతుల్లో 4×4, 1×6), హార్దిక్ పాండ్య (25; 16 బంతుల్లో 3×4, 1×6) కూడా రాణించారు. కివీస్ బౌలర్లలో డఫీ, జేమీసన్ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో కివీస్ పోరాడినా.. 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులే చేయగలిగింది. గ్లెన్ ఫిలిప్స్ (78; 40 బంతుల్లో 4×4, 6×6) మెరుపులు సరిపోలేదు. వరుణ్ చక్రవర్తి (2/37), శివమ్ దూబె (2/28), అర్ష్‌దీప్ (1/31) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

**రింకు సింగ్ 44 నాటౌట్**

ఆరంభమే తడబాటుతో..: అసలే భారీ ఛేదన.. ఆపై 1 పరుగుకే 2 వికెట్లు! ఇలా మొదలైంది న్యూజిలాండ్ ఇన్నింగ్స్. తొలి ఓవర్ రెండో బంతికే కాన్వే (0)ను సంజు క్యాచ్ ద్వారా అర్ష్‌దీప్ ఔట్ చేశాడు. ఓ మెరుపు డైవ్‌తో సంజు ఈ క్యాచ్ అందుకున్నాడు. హార్దిక్ వేసిన తర్వాత ఓవర్లో రచిన్ రవీంద్ర (1) డగౌట్‌కు వెళ్లిపోయాడు. ఈ స్థితిలో ఫిలిప్స్ నిలిచాడు. టిమ్ రాబిన్సన్ (21)తో కలిసి స్కోరు పెంచాడు. వీళ్లిద్దరూ దూకుడుగా ఆడడంతో 6 ఓవర్లకు 50/2తో కివీస్ కోలుకుంది. ఫిలిప్స్, రాబిన్సన్ బ్యాట్ ఝుళిపించినా.. సాధించాల్సిన రన్‌రేట్ మాత్రం అదుపులోకి రాలేదు. దీనికి తోడు రాబిన్సన్‌ను వరుణ్ ఔట్ చేశాడు. అయినా ఫిలిప్స్ పోరాటం కొనసాగించాడు. చాప్‌మన్ జతగా స్కోరు పెంచాడు. వరుణ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన ఫిలిప్స్.. 29 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అయితే ఫిలిప్స్, చాప్‌మన్ (39; 24 బంతుల్లో 4×4, 2×6) వరుస ఓవర్లలో ఔటైపోవడంతో మిణుకుమంటున్న కివీస్ ఆశలు ఆవిరయ్యాయి. ఆ తర్వాత మిచెల్ (28; 18 బంతుల్లో 4×4), శాంట్నర్ (20 నాటౌట్; 13 బంతుల్లో 2×4) పోరాటం పరుగుల అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

**ఫిలిప్స్ 78**

అభిషేక్ ధనాధన్: ఆరంభంలో తడబాటు.. తర్వాత దూకుడు.. మళ్లీ వికెట్లు.. ఆఖర్లో మెరుపు ముగింపు.. భారత్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. మొదట భారత్ భారీ స్కోరు చేసిందంటే అభిషేక్ శర్మ విధ్వంసం వల్లే. తొలి ఓవర్లోనే సిక్స్‌తో మొదలుపెట్టిన అభిషేక్.. దూకుడు పెంచుతూ పోయాడు. అయితే భారత్ ఇన్నింగ్స్ తడబాటుతో మొదలైంది. రెండో ఓవర్లోనే సంజు శాంసన్ (10) ఔటైపోయాడు. రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న ఇషాన్ కిషన్ (8) కూడా ఎంతోసేపు నిలవలేదు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీకి తరలించి జోరు మీద కనిపించిన ఇషాన్.. ఇంకో ఫోర్ కొట్టి, డఫీ బౌలింగ్‌లో చాప్‌మన్‌కు చిక్కాడు. ఈ స్థితిలో అభిషేక్, కెప్టెన్ సూర్యకుమార్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. ముఖ్యంగా అభిషేక్ మెరుపు షాట్లతో స్కోరు పెంచాడు. జేమీసన్, క్లార్క్‌లకు చెరో రెండు సిక్స్‌లు వడ్డించిన అతడు.. ఫిలిప్స్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. పేలవ ఫామ్‌లో ఉన్న సూర్య ఈ మ్యాచ్‌లో మెరుగ్గా ఆడాడు. దీంతో పవర్‌ప్లే ఆఖరికి భారత్ 68/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. దూకుడును కొనసాగించిన అభిషేక్.. 22 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. 11 ఓవర్లకు 130/3తో టీమ్‌ఇండియా భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. అయితే ఓవర్ తేడాతో సూర్య, అభిషేక్ ఔట్ కావడంతో జట్టుకు ఎదురు దెబ్బ తగిలింది. మొదట 11వ ఓవర్లో సూర్యను శాంట్నర్ ఔట్ చేయగా.. తర్వాతి ఓవర్లోనే అభిషేక్ సైతం అతడిని అనుసరించాడు. సోధి వేసిన 12వ ఓవర్లో వరుసగా 4, 6, 6 కొట్టి సెంచరీకి సమీపంగా వచ్చిన అభిషేక్.. అదే ఓవర్లో మరో షాట్‌కు ప్రయత్నించి, ఔటైపోయాడు. శివమ్ దూబె (9) కూడా నిలవలేదు. అయితే హార్దిక్ పాండ్య ఉన్నంతసేపు దూకుడుగా ఆడడంతో మళ్లీ రన్‌రేట్ పెరిగింది. హార్దిక్ వెనుదిరిగాక.. రింకు అందుకున్నాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో అతడు 2 సిక్స్‌లు, 2 ఫోర్లతో 21 పరుగులు రాబట్టాడు.

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) రచిన్ (బి) జేమీసన్ 10; అభిషేక్ శర్మ (సి) జేమీసన్ (బి) సోధి 84; ఇషాన్ కిషన్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 8; సూర్యకుమార్ (సి) రాబిన్సన్ (బి) శాంట్నర్ 32; హార్దిక్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 25; దూబె (సి) అండ్ (బి) జేమీసన్ 9; రింకు నాటౌట్ 44; అక్షర్ (సి) మిచెల్ (బి) క్లార్క్ 5; అర్ష్‌దీప్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 238; వికెట్ల పతనం: 118, 227, 3126, 4149, 5166, 6185, 7209; బౌలింగ్: డఫీ 40272; జేమీసన్ 40542; క్రిస్టియన్ క్లార్క్ 40401; సోధి 30381; ఫిలిప్స్ 10200; శాంట్నర్ 30371; మిచెల్ 10210

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 0; రాబిన్సన్ (సి) దూబె (బి) వరుణ్ 21; రచిన్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 1; ఫిలిప్స్ (సి) దూబె (బి) అక్షర్ 78; చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) వరుణ్ 39; మిచెల్ (సి) బిష్ణోయ్ (బి) దూబె 28; శాంట్నర్ నాటౌట్ 20; క్లార్క్ (సి) రింకు (బి) దూబె 0; జేమీసన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 190; వికెట్ల పతనం: 10, 21, 352, 4131, 5143, 6189, 7189; బౌలింగ్: అర్ష్‌దీప్ 40311, హార్దిక్ 20201, బుమ్రా 30290, అక్షర్ 3.30421, వరుణ్ చక్రవర్తి 40372, దూబె 30282, అభిషేక్ 0.3030

**అక్షర్‌కు గాయం**
**అక్షర్**

న్యూజిలాండ్‌తో తొలి టీ20లో భారత వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ గాయపడ్డాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో 16వ ఓవర్లో అతడి చేతి వేళ్లకు గాయమైంది. అప్పటికే మూడు ఓవర్లు వేసిన అక్షర్.. కీలకమైన ఫిలిప్స్ వికెట్ తీశాడు. తన నాలుగో ఓవర్లో మూడో బంతికి బ్యాటర్ మిచెల్.. నేరుగా బలంగా కొట్టాడు. ఆ బంతిని ఆపే ప్రయత్నంలో అక్షర్ చేయి అడ్డుపెట్టగా.. వేళ్లను తాకుతూ బంతి బౌండరీకి వెళ్లింది. బంతి గట్టిగా తగలడంతో అక్షర్ వేళ్లకు గాయమై.. రక్తం కారింది. ఫిజియో సపర్యలు చేసినా.. నొప్పి తగ్గకపోవడంతో అక్షర్ పెవిలియన్ చేరాడు. ఆ ఓవర్లో మిగిలిన మూడు బంతులను అభిషేక్ శర్మ వేశాడు. అక్షర్ గాయం తీవ్రత ఎంతన్నది తెలియలేదు. త్వరలో టీ20 ప్రపంచకప్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఈ స్పిన్ ఆల్‌రౌండర్‌కు గాయం కావడం భారత్‌కు ఆందోళన కలిగించేదే.

**డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు**
**గుజరాత్ × యూపీ**
**వేదిక: వడోదర, రాత్రి 7.30**

# సింధు, లక్ష్య శుభారంభం



**జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 22-20, 21-18తో మనామి స్యుజు (జపాన్)పై, అన్మోల్ ఖార్బ్ 21-16, 21-17తో యు పా (చైనీస్ తైపీ)పై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఆకర్షి కశ్యప్ 21-8, 20-22, 17-21తో జూలీ జాకబ్‌సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-13, 16-21, 21-14తో వాంగ్ వీ (చైనీస్ తైపీ)పై, కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-23, 24-22తో కొకి వతనబె (జపాన్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. హెచ్.ఎస్.ప్రణయ్ 19-21, 11-21తో లీ జియా (మలేసియా) చేతిలో, కిరణ్ జార్జ్ 17-21, 14-21తో మహ్మద్ జకి (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో హరిహరన్- అర్జున్ జోడీ 21-19, 21-13తో అలీ రెహాన్- డెవిన్ వాహ్యుది (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని 9-21, 20-22తో టామ్- డెల్ఫెన్ (ఫ్రాన్స్) చేతిలో, ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో 23-21, 20-22, 6-21తో జూలియెన్ మైయో- లియా పాలెర్మో (ఫ్రాన్స్) చేతిలో ఓడారు.**

# ఎందుకు పక్కన పెట్టామో చెప్పాలి



**దిల్లీ: జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవడం కష్టమైన విషయమని, అయితే ఒక ఆటగాడిని ఎందుకు పక్కన పెట్టామో అతడికి వివరించాల్సిన అవసరం ఉందని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. వచ్చే నెలలో మొదలయ్యే టీ20 ప్రపంచకప్‌నకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న రోహిత్.. తొలిసారిగా ఈ టోర్నీని ఇంటి నుంచి చూడబోతుండడం తనకు వింత అనుభవమని అన్నాడు. "నా కెరీర్‌లో ఇప్పటి వరకు జరిగిన ప్రతి టీ20 ప్రపంచకప్‌లో నేను భాగమయ్యా. తొలిసారి ఇంటి నుంచి మ్యాచ్‌లను చూడనుండటం చాలా వింతగా అనిపిస్తుంది. స్టేడియంలో ఉన్నా కూడా అది గతంలో మాదిరిగా ఉండదు. ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవడమే సారథ్యంలో అత్యంత క్లిష్టమైన అంశం. జట్టు ఎంపికలో అందరినీ మెప్పించలేం. కానీ ఎందుకు పక్కన పెట్టామో ఆటగాడికి వివరించడం ముఖ్యం. 2022 ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ సమయంలో శ్రేయస్ అయ్యర్‌ను కాదని బౌలింగ్ చేయగలిగే దీపక్ హుడాను తీసుకున్నాం. జట్టు సమతూకం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నేను, చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా శ్రేయస్‌కు తెలియజేశాం. 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో చాహల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ అప్పుడు మహ్మద్ సిరాజ్‌కు ఇదే తరహాలో వివరించాం. రానున్న పొట్టి కప్పులో భారత్ సత్తాచాటుతుందన్న నమ్మకం ఉంది. జట్టులో 80 నుంచి 90 శాతం మంది ఆటగాళ్లు గత రెండేళ్లుగా కలిసి ఆడుతున్నారు. జట్టు సగటు వయసు 25 ఏళ్లే ఉండటం సానుకూలాంశం" అని రోహిత్ తెలిపాడు.**